ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 12 జూలై 2024



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	34	27
భద్రాద్రి	33	26



రాయలను అభినందిస్తున్న మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి

గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా

రాయల బాధ్యతల స్వీకరణ

మంత్రులు తుమ్మల, పొంగులేటి శుభాకాంక్షలు

ఖమ్మం, జూలై 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు హైదరాబాదులోని సంస్థ కార్యాలయంలో మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికి ఆశీర్వదించారు. అనంతరం చైర్మన్‌గా రాయల బాధ్యతలు స్వీకరించారు. రాయల నాగేశ్వరరావుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తోపాటు పలువురు నాయకులు రాయలకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రైతులకు అవసరమైన చోట గిడ్డంగులు ఏర్పాటు చేస్తానని, రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పర్యటించి గిడ్డంగుల సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. రైతులకు ఎక్కువ స్థాయిలో గిడ్డంగులు ఉంటే పంటలు నిలువ చేసే సౌలభ్యం ఉంటుందని వివరించారు. చైర్మన్‌గా నియమించి రైతులకు సేవలందించేందుకు అవకాశం కలిపించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్‌కమిటీల పేరుతో కాలయాపన

- రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా



ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, జూలై 11: అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సబ్ కమిటీలు, అభిప్రాయాల సేకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ రైతులకు ద్రోహం చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. ఖమ్మం కలెక్టరేట్ ఎదుట గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులవుతున్నా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 40రోజులు గడుస్తున్నా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రెండు లక్షల వ్యవసాయ రుణమాఫీ సోనియాగాంధీ జన్మదిన డిసెంబర్ 9వ తేదీన అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి సబ్‌కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసే దాకా బీజేపీ కిసాన్‌మోర్చా విశ్రమించదని పేర్కొన్నారు. రైతుల పక్షాన ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8, 9 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ ఆందోళనలో పాల్గొన్న ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉపేక్షించేది లేదన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొంగల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు అనంత ఉపేందర్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, వైరా, మధిర అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు, ఏలూరు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వర్లు, కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి వల్లభనేని పుల్లయ్య, సీతారాములు, కార్యవర్గ సభ్యుడు ఎల్లారావు గౌడ్, పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

> ఓపెన్ కాస్ట్ గనులతో కోల్‌బెల్ట్ ప్రాంతాలు బొందల గడ్డలుగా మారుతుండటం, దుమ్ము దూళితో పర్యావరణం దెబ్బతింటుండటం, అనుమతుల్లో జాప్యం లాంటి సమస్యలు అధిగమించడానికి ఇకపై భూగర్భ బొగ్గు గనుల ఏర్పాటుకే ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించటం పట్ల సింగరేణివ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్వయంగా అండర్ గ్రౌండ్ బొగ్గు గనుల ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొగ్గు చూపుతున్న విషయాన్ని తనను కలిసిన బీఎంఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సింగరేణి కార్మిక సంఘాల నేతలకు వివరించడం గమనార్హం.



యూజీల వైపు

కేంద్రం చూపు..

అండర్ గ్రౌండ్ బొగ్గు గనులకు ప్రాధాన్యం

- త్వరితగతిన క్లియరెన్స్‌లకు అవకాశం
- బొగ్గు మంత్రిత్వశాఖ సలహాదారుగా సింగరేణి మాజీ అధికారి

ఇల్లెందు, జూలై 11: విద్యుత్ ఉత్పాదనలతో పాటు పలు పరిశ్రమల మనుగడకు కీలకాధారంగా మారిన బొగ్గు ఉత్పాదనలతో పాటు నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం శరవేరంగా చర్యలు చేపడుతోంది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా జి.కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రభుత్వరంగ పరిశ్రమ సింగరేణి కాలరీస్ మనుగడపై సంస్థ భవితవ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తుండటం పట్ల రాజకీయాలకు అతీతంగా కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఓసీల వల్ల దుమ్ము, దూళి వ్యాపించడం, ఓవర్ బర్డెన్ డంపింగ్ సమస్యలు, స్థల సేకరణలు సమస్యలుగా మారడం పర్యావరణం, అటవీశాఖల క్లియరెన్స్‌లు తీవ్ర జాప్యం జరుగుతుండటం, వన్యప్రాణుల సంసరక్షణలాంటి చట్టాల మూలంగా ఓసీల ఏర్పాటు క్లిష్టమవుతున్నట్లు కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొనడంతో కేంద్ర ప్రభుత్వం అండర్ గ్రౌండ్ బొగ్గు గనుల ఏర్పాటుకే ప్రాధాన్యత ఇవ్వబోతుందన్న విషయం వెల్లడైంది. యూజీల వల్ల తక్కువ భూ సేకరణ, ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు లభించడమే కాక పర్యావరణ సమస్యలు పెద్దగా ఉండకపోవడం, వివిధ శాఖ క్లియరెన్స్‌లు సైతం త్వరితగతిన లభిస్తాయన్న ఆశాభావాన్ని కార్మిక సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఒడిశాలోని నైనిబ్లాక్‌ను నిర్లక్ష్యం చేయటం, ప్రైవేట్ గుత్త పెట్టుబడిదారుడికి అప్పగించే యత్నాలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకట్ట వేయటం గమనార్హం. దాదాపు దశాబ్ధకాలంగా నైని బ్లాక్ సమస్య సింగరేణి యాజమాన్యానికి ఇబ్బందికరంగా మారిన నేపథ్యంలో కేంద్రమంత్రిగా నియమితులైన కిషన్‌రెడ్డి నెలరోజుల వ్యవధిలోనే ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఒప్పించడం, అన్నిరకాల క్లియరెన్స్‌లతో సింగరేణి ఆధ్వర్యంలోనే బొగ్గు ఉత్పాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇప్పించడం, ఏటా అదనంగా పది మిలియన్ టన్నుల ఉత్పత్తికి అవకాశాలు కల్పించడం పట్ల కార్మికసంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

నూతన గనులకు పెనుసవాళ్లు..

రాష్ట్రంలో సింగరేణి కాలరీస్ 18 ఓపెన్ కాస్ట్ 22 భూగర్భ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. రాష్ట్రంలోని 6 జిల్లాలో పరిధిలో సింగరేణి జరిపిన బొగ్గు అన్వేషణల్లో గోదావరిలోయలో 22.016 మిలియన్ టన్నులు బొగ్గు నిల్వలు ఉన్నట్లు గతేడాది నిపుణులు గుర్తించారు. సింగరేణి తన సొంత ఖర్చులతో చేసిన అన్వేషణలతో 10 నూతన బ్లాకులను సిద్ధం చేసుకుంది. అయితే 2013లో అప్పటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం 218 మైనింగ్ బ్లాకులను నామినేషన్ పద్ధతిలో ఇష్టారాజ్యంగా చేసిన కేటాయింపులను కాగ్ తప్పు పట్టింది. ఇదే విషయంలో 2014 ఆగస్టు 14న సుప్రీంకోర్టు 214 బొగ్గు బ్లాకుల కేటాయింపులను రద్దు చేసి పారదర్శకంగా బొగ్గు బ్లాకులను కేటాయించాలని ఆదేశించడంతో 2015లో పార్లమెంట్‌లో బొగ్గు గనుల చట్టానికి సవరణలు చేసి కేంద్ర మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ క్రమంలో 2015లోనే నామినేషన్ పద్ధతిలో కోల్ ఇండియా (సీఐఎల్) కోరిన 116 బొగ్గు బ్లాకులను కేంద్ర కేటాయించింది. అయితే ఆ సమయంలో రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించాలని కేంద్రాన్ని కోరకపోవడం గమనార్హం. ఫలితంగా రాష్ట్రంలోని ఇల్లెందు ఏరియాలో ఉన్న కోయగూడెం, సత్తుపల్లి, శ్రావణపల్లి, కళ్యాణకని బొగ్గు బ్లాకులను టెండర్ల ప్రక్రియలో చేర్పించింది. అయితే ఇప్పటికే తొమ్మిది పర్యాయాలు జరిగిన టెండర్ల విధానంలో సింగరేణి పాల్గొనకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుపడటంతో సింగరేణి యాజమాన్యం టెండర్ల ప్రక్రియకు దూరంగా ఉంది. ఫలితంగా కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు బ్లాకులు ప్రైవేట్ సంస్థల పరమయ్యాయి. అయితే సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కార్మిక సంఘాలు పట్టుబడుతూ కేంద్రానికి విజ్ఞప్తి చేశాయి. అయితే షెడ్యూల్ ప్రాంతాల చట్టాల వల్ల ప్రైవేట్ సంస్థలకు బొగ్గు తవ్వకాలకు అవకాశాలు లేకపోవడం లాంటి కారణాలతో ప్రైవేట్ సంస్థలు టెండర్ల ద్వారా పొందిన రెండు బ్లాకులతో పాటు గతంలో మూడు పర్యాయాలు టెండర్లు పిలిచినా బిడ్లు దాఖలు కాని ఇతర మరో రెండు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని ఇటీవల సింగరేణి కార్మిక సంఘాల నాయకులు పులి రాజిరెడ్డి (బీఎంఎస్), వాసిరెడ్డి సీతారామయ్య (ఏఐటీయూసీ), బి.జనక్ ప్రసాద్(ఐఎన్‌టీయూసీ) తదితరులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని స్వయంగా కోరారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల అభిప్రాయాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని, అంతేకాక రిటైర్డ్ కార్మికుల సమస్యలు సైతం పరిష్కరించేందుకు త్వరలో కార్మిక సంఘాల సమావేశం ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.

బొగ్గు మంత్రిత్వశాఖ సలహాదారుగా సింగరేణి మాజీ అధికారి

కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ సలహాదారుగా సింగరేణి మాజీ మైనింగ్ అధికారి వీరారెడ్డిని నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది. కోల్ ఇండియాలో టెక్నికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న వీరారెడ్డి గతంలో ఇల్లెందులో మైన్ మేనేజర్‌గా పనిచేయడమే కాక ఆడ్రియాల ప్రాజెక్ట్ అధికారిగా సేవలందించారు. బొగ్గు ఉత్పాదన, మైనింగ్ ఆపరేషన్లలో అనుభవం కలిగిన వీరారెడ్డి నియామకం ద్వారా సింగరేణికి మరింత ప్రయోజనం కలుగుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. ఆగస్టులో కోల్ ఇండియాలో ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఆయన కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వశాఖలో సలహాదారుగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఇంటిదొంగలకు శిక్షలేదా..!?

- ప్రభుత్వ విద్యాసంస్థల్లో నిధుల స్వాహా ఘటనల్లో చర్యలు శూన్యం
- కఠిన చర్యలకు జిల్లా విద్యాశాఖ అధికారుల వెనకడుగు
- కేవలం రికవరీతోనే సరిపెడుతున్న వైనం
- ఇదే అదనుగా రెచ్చిపోతున్న మరికొందరు

6

‘పేట’లో నలుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- ఎస్ఐ ఆత్మహత్య కేసులో పోలీస్‌శాఖ చర్యలు

అశ్వారావుపేట, జూలై 11: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు కానిస్టేబుళ్లు సస్పెన్షన్‌కు గురయ్యారు. జూన్ 30న అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ తన మరణ వాంగ్మూలంలో అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్లు తనను వేధింపులకు గురి చేశారని, వారి వేధింపులే తన ఆత్మహత్యకు కారణమని తెలిపారు. ఈ నేపథ్యంలో కానిస్టేబుళ్లు శివ, సుబాని, సన్యాసి నాయుడు, శేఖర్‌లను సస్పెండ్ చేస్తూ గురువారం భద్రాద్రి ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

దేశంలో భద్రాద్రి జిల్లా ఆదర్శంగా నిలవాలి

- వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ యోగితా రానా
- కొత్తగూడెం కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో సమీక్ష
- సింగభూపాలెం చెక్‌డ్యాం పరిశీలన



సింగభూపాలెం చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ యోగిత రానా, పక్కన భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆస్పిరేషన్ జిల్లాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దేశంలోనే ఆదర్శంగా నిలపాలని రాష్ట్ర వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ, సంపూర్ణత అభియాన్ ఇన్‌చార్జ్ అధికారి డాక్టర్ యోగితా రానా అధికారులకు సూచించారు. కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వివిధశాఖల అధికారులతో కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో కలిసి ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగితారానా మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఐఏఎస్‌గా తాను మొదట భద్రాచలంలోనే విధులు నిర్వహించానన్నారు. జిల్లా అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. జిల్లా అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏజెన్సీ మండలమైన గుండాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, సంపూర్ణత అభియాన్ లక్ష్యాలను 100శాతం సాధించాలని కోరారు. జాతీయస్థాయిలో భద్రాద్రి జిల్లాకు అవార్డులు సాధించాలని తెలిపారు. వైద్యశాఖాధికారులు, మహిళ శిశుసంక్షేమ అధికారులు సమన్వయంతో పని చేసి తక్కువ బరువు, ఎత్తు ఉన్న పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరైన పోషకాహారం అందించాలన్నారు. ఇందు కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 1,85,000మంది రైతులకు 5 లక్షల 56వేల ఎకరాల భూమి సాగులో ఉందని జిల్లా వ్యవసాయశాఖాధికారి వివరించగా ప్రతి రైతు భూమికి భూసార పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. కొత్తగూడెంలో భూసార పరీక్ష కేంద్రాన్ని త్వరితగతిన అందుబాటులోకి తేవాలని, అప్పటి వరకు వ్యవసాయ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో భూసార పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని గ్రంథాలయాల్లో అంధ, మూగ, చెవిటి, పిల్లల కోసం ప్రత్యేక చాంబర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు.

చెక్‌డ్యాం పనుల నాణ్యత ఎలా ఉంది

ఈ సమావేశానికి ముందు సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం ప్రాంతంలో ఉన్న చెక్‌డ్యాంను గురువారం రాష్ట్ర వ్యవసాయ సెక్రటరీ డాక్టర్ యోగితారానా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అక్కడున్న రైతులతో మాట్లాడి చెక్‌డ్యాం పనుల నాణ్యతపై ఆరా తీశారు. రైతులు చెక్‌డ్యాం అవతల వైపునకు పంటలను తరలించడానికి సరైన రహదారి లేదని, రహదారి మంజూరు చేయాలని రైతులు కోరారు. దీంతో రహదారి విషయాన్ని పరిశీలించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం వేపలగడ్డ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ తాగునీటి సౌకర్యాన్ని పరిశీలించారు. గర్భిణులు, పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. అక్కడి నుంచి సర్వారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం కొత్తగూడెంలోని కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళ ఉద్యోగుల పిల్లల సంరక్షణకు ఏర్పాటుచేసిన కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభారి కార్యదర్శి పవన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కేవీకే సైంటిస్ట్ డాక్టర్ ఆర్. శ్రీనివాస్‌రావు, సీపీవో శ్రీనివాసరావు, జిల్లా వైద్యాశాఖాధికారి చంద్రమౌళి, వ్యవసాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అర్జున్‌రావు, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి, మహిళ శిశు సంక్షేమ అధికారి విజేత, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబురావు, పశు సంవర్ధకశాఖ అధికారి పురందరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాకు

‘హైవే’ల కళ

- జగ్గయ్యపేట టూ కొత్తగూడెం మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చాలని ప్రతిపాదనలు
- హైదరాబాద్ టూ మహబూబాబాద్ మీదుగా కొత్తగూడెనికి జాతీయ రహదారి
- మంత్రి తుమ్మల చొరవతో భద్రాద్రి జిల్లాకు తీరనున్న కష్టాలు

7



భద్రాద్రి దేవస్థానంలో

బదిలీలకు రంగం సిద్ధం

- ఉద్యోగులకు ఆప్షన్ ఫామ్‌ల అందజేత
- భారీగానే బదిలీలు జరుగొచ్చంటున్న ఉద్యోగవర్గాలు
- 29 వరకు బదిలీల షెడ్యూల్ పొడిగింపు

6

ప్రతిభ ఆధారంగానే నియామకం

- కొత్తగూడెం మెడికల్ కళాశాలలో 155 పోస్టులను నిబంధనల ప్రకారమే నియమిస్తాం
- దళారులను నమ్మి మోసపోవద్దు
- జిల్లా ఉపాధి కల్పన అధికారి విజేత



చుంచుపల్లి, జూలై 11: కొత్తగూడెం మెడికల్ కళాశాలలో 155 అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ప్రతిభ ఆధారంగానే నియామక ప్రక్రియ జరుగుతుందని, నిబంధనలకు అనుగుణంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేత గురువారం తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి సుమారు జిల్లాలో 5వేల మంది నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, ప్రతిభ ఆధారంగా నివేదికను సిద్ధం చేస్తామని సూచించారు. ఈ క్రమంలో కొత్తగూడెం మెడికల్ కళాశాలలో ఏజెన్సీ నుంచే ఈ అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ జరగాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టులో సంబంధిత స్థానిక ఏజెన్సీ వారు ఆశ్రయించారని తెలిపారు. అందుకు సమాధానంగా జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈ అవుట్ సోర్సింగ్ భర్తీకి చేపట్టనున్న ఆధారాలను అందుకు సంబంధించిన పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో కోర్టు ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇది గమనించాలని కోరారు. ఈ పోస్టులకు అభ్యర్థుల అర్హత, ప్రతిభ ఆధారంగానే భర్తీ చేయనున్నట్టు స్పష్టం చేశారు. అదేవిధంగా ఈ పోస్టులను ఇప్పిస్తామని దళారులు నిరుద్యోగులను ఆశ్రయిస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దు అని పేర్కొన్నారు. ఎటువంటి నగదు లావాదేవీలు జరిగినా.. తమ దృష్టికి తేవాలని శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న కొన్ని రోజుల్లోనే మెడికల్ కళాశాలలో 23 విభాగాలలో 155 పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

సాగుకు కిరాయి కాడెడ్లు...

- సీజన్‌కు జత ఎడ్లకు రూ. 30 వేల కిరాయి

తల్లాడ, జూలై 11: ఎడ్లు కొనే స్థోమత లేని రైతులు వ్యవసాయ సాగుకు అవసరమైన కాడెడ్లను కిరాయికి తెస్తున్నారు. సీజన్‌కు జత ఎడ్లకు రూ.30వేల చొప్పున కిరాయి చెల్లిస్తున్నారు. తల్లాడ మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి, మిర్చి పంటలు సాగుచేసే కొందరు రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నుంచి కిరాయికి కాడెడ్లు తెస్తున్న పరిస్థితి ఉంది. పత్తి సాగుచేసేటప్పుడు విత్తనం వేయడానికి ముందు అచ్చు తోలకం, విత్తనం నాటి పత్తి మొలకెత్తిన వారంరోజుల తర్వాత నుంచి కలుపు, గడ్డిమొక్కలు తొలగించేందుకు గొర్రు, గుంటకతో దున్ని పైపాటు చేస్తారు. పత్తిపైరు ఏపుగా పెరిగి పూత, కాయ దశకు వచ్చేవరకు తరచూ నాలుగైదుసార్లు గొర్రు, గుంటకతో దున్ని పైపాటు చేస్తారు. సాగునీరు పత్తి మొక్కలకు అందేలా అరకతో బోదె తోలకం కూడా చేయాల్సి ఉంటుంది. మిర్చి సాగులో కూడా మొక్కలు నాటే ముందు అచ్చు తోలకం, మిర్చి సాగు ఏపుగా పెరిగే వరకు కలుపు, గడ్డిమొక్కల నివారణ కోసం ఐదారుసార్లు గొర్రు, గుంటకతో దున్ని పైపాటు చేయాల్సి ఉంటుంది. పత్తి, మిర్చి పైర్లలో అరకతో దుక్కి దున్నాల్సి రావడంతో జత ఎడ్లు అవసరముంటుంది. జత ఎడ్లను కొనుగోలు చేయాలంటే రూ.రెండులక్షల వ్యయం అవుతుంది. తల్లాడ మండలంలోని మల్లవరం, బాలపేట, అన్నారుగూడెం, మంగాపురం తదితర గ్రామాల్లో పత్తి, మిర్చి సాగుచేసే ఆర్థిక స్థోమత లేని కొందరు రైతులు ఎన్టీఆర్ జిల్లా నూజివీడు, తిరువూరు, జగ్గయ్యపేట ప్రాంతాల నుంచి పశువుల పెంపకందార్ల వద్దనుంచి కాడెడ్లను కిరాయికి తెస్తున్నారు. ఆరునెలలకు జత ఎడ్లకు రూ.30వేలు కిరాయి చెల్లించడంతోపాటు వాటి పోషణ బాధ్యత కూడా భరించటం జరుగుతుంది.





కిరాయి ఎడ్లతో వెసులుబాటు
దుగ్గిదేవర రామారావు, రైతు, మల్లవరం

సొంత పొలంతోపాటు కౌలుకు తీసుకొని మూడెకరాల్లో పత్తి, మరో మూడెకరాల్లో మిర్చి సాగు చేస్తున్నా. వ్యవసాయ సాగు కోసం పత్తి, మిర్చి పైర్లలో తరచూ గొర్రు, గుంటకతో దున్ని పైపాటు చేసేందుకు ఎన్టీఆర్ జిల్లా నుంచి నూజివీడు మండలం లైన్‌తండాలో ఒక రైతు వద్ద జత ఎడ్లను కిరాయికి తెచ్చాం. వానాకాలం వ్యవసాయ సీజన్ ఆరునెలలకు జత ఎడ్లకు రూ.30వేల కిరాయి చెల్లించడంతోపాటు పోషణ బాధ్యత కూడా తామే తీసుకున్నాం. జత ఎడ్లను కిరాయికి తీసుకోవడం వల్ల కొంత ఆర్థిక వెసులుబాటు కలిగింది.



పూసుగుప్ప క్యాంపులో ఎస్పీ, చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న రోహిత్‌రాజ్

పేదల సంక్షేమమే పోలీస్ బాధ్యత : ఎస్పీ

- అన్నల ఇలాకాలో ప్రత్యేక వైద్యశిబిరం
- నాలుగు గ్రామాల ప్రజలకు పరీక్షలు
- పూసుగుప్ప, వద్దిపేట క్యాంపుల సందర్శన
- అప్రమత్తంగా ఉండాలని సూచన

చర్ల, జూలై 11:చర్ల మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన చెన్నాపురంలో గురువారం చర్ల పోలీసులు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ప్రారంభించి మాట్లాడారు. పేదలకు సేవలందించడంలో పోలీస్‌శాఖ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇందులో భాగంగానే వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధులు ప్రజలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరలో రూ.కోటితో నిర్మిస్తున్న మొబైల్ వైద్యశాల అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అనారోగ్యం వస్తే నాటు మందులు, భూత వైద్యుల దగ్గరకు వెళ్లొద్దన్నారు. యువత చదువు, క్రీడలపై మక్కువ చూపాలన్నారు. మావోయిస్టులను గ్రామాల్లోకి రానివ్వద్దన్నారు. మావోయిస్టులకు సహకరించి జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని సూచించారు. అనంతరం చర్ల సీఐ రాజువర్మ మాట్లాడుతూ, నేడు ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చెన్నాపురం, బట్టిగూడెం, ఎర్రంపాడు, బత్తినిపల్లి గ్రామాలకు చెందిన సుమారు 150 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశామన్నారు. ఈ శిబిరంలో భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్, చర్ల ఎస్‌ఐ నర్సిరెడ్డి, సత్యనారాయణపురం, చర్ల వైద్యులు దివ్యసాయివర్ధన్, డాక్టర్ విజయరావు, భద్రాచలం వైద్యులు డాక్టర్ శ్రీకాంతి, లోకేష్ తదితరులు ఉన్నారు. వైద్యశిబిరం అనంతరం ఎస్పీ గ్రామంలో కలియ తిరిగారు. గ్రామస్థులతో మాట్లాడారు. చిన్నారుల పాఠశాలను సందర్శించారు. చిన్నారులకు తినుమండారాలు, దుస్తులు అందించారు. అలాగే చర్ల మండలంలోని ఉంజుపల్లి, వద్దిపేట గ్రామాల్లోని సీఆర్‌పీఎఫ్ పోలీస్ క్యాంపులను ఎస్పీ సందర్శించారు. మావోయిస్టుల కదలికలు ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మెడికల్ కళాశాలకు ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్ల కేటాయింపు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 11: ఖమ్మం మెడికల్ కళాశాలకు ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లను కేటాయిస్తూ డీఎంఈ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ మెడిసిన్‌కు డాక్టర్ టి.రాజీవ్ కుమార్, పిడియాట్రీషియన్ డాక్టర్ బి.బాబూరత్నాకర్, జనరల్ సర్జరీకి డాక్టర్ ఏ.విజయ్‌కుమార్, ఆర్థోపెడిక్స్ విభాగానికి డాక్టర్ బీఎం చంద్రశేఖర్, ఫమెకాలజీకి డాక్టర్ ఎస్.సుగుణ, అనస్థీషియాకు డాక్టర్ టి.నరేందర్, డెంటల్ విభాగానికి డాక్టర్ సందీపాము తబితారాణిని కేటాయించారు. వీరిలో పిడియాట్రీషిన్ డాక్టర్ బాబూరత్నాకర్ ప్రస్తుతం ఖమ్మం మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

టీజీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌కు కలెక్టర్ అభినందన

ఖమ్మం కలెక్టరేట్, జూలై 11: తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావును ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమించబడిన అనంతరం గురువారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో కొత్వాల కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో డీసీవో ఖుర్షిద్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కె.సందీప్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వై.ముత్తయ్య, మండల అధ్యక్షుడు కొండెం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి మహేష్ పాల్గొన్నారు.



కొత్వాలను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

వచ్చేది జ్వరాల సీజన్

- అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- గిరిజనులకు దోమతెరలు, మందులు సిద్ధంగా ఉంచాలి

కొత్తగూడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూర్తి ఏజెన్సీ ప్రాంతం కావడం.. గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన విషజ్వరాలు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర జ్వరాలు ప్రబలకముందే జిల్లా యంత్రాంగం ముందు జాగ్రత్తగా వ్యాధులను నివారించేందుకు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే అక్కడక్కడ డెంగ్యూ, మలేరియా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఆయా గిరిజన గ్రామాల్లో వైద్య సహాయం అందించేందుకు అవసరమైన మందులు, దోమల నివారణ చర్యలు చేపట్టాల్సి అవసరం ఉంది. దోమ తెరలను సైతం పంపిణీ చేయాలి. ప్రధానంగా ఆయా గ్రామ పంచాయతీలతో పాటుగా మునిసిపాలిటీ పరిధిలో పారిశుధ్య నివారణ చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేయాలి. ప్రధానంగా భద్రాచలం డివిజన్ పరిధిలో చర్ల, దుమ్ముగూడెం, పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాలతోపాటు పాల్వంచ, ములకలపల్లి, ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు తదితర మండలాల్లో ఇటీవల కురిసిన వర్షాల వల్ల విషజ్వరాలతోపాటు డెంగ్యూ, మలేరియా జ్వరాలు సైతం ప్రబలుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ప్రధానంగా జ్వరాలు, ఒళ్లనొప్పులు రావడం, ప్లేట్‌లేట్స్ తగ్గిపోవడంతో రోగులు నిరసపడిపోతున్నారు. దీంతోపాటు కీళ్ల నొప్పులు రావడంతో మరింతగా నడవలేక పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో ప్రధానంగా పారిశుధ్య నివారణ చర్యలు సక్రమంగా చేపట్టకపోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో వర్షాకాలం సీజన్‌లో దోమలు మరింతగా వ్యాప్తి చెందడంతో జ్వరాల బారిన పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకముందే జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

ఇంటిదొంగలకు శిక్షలేదా..!?

● ప్రభుత్వ విద్యాసంస్థల్లో నిధుల స్వాహా ఘటనల్లో చర్యలు శూన్యం

ఖమ్మం ఖానాపురం హవేలి జూలై 11: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న కొందరు సిబ్బంది ఆయా విద్యా సంస్థల నిధులను కాజేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం నిధులను రికవరీ చేయటంతో వారిలో భయం లేకుండా పోతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. నిధులను స్వాహా చేసిన వ్యక్తులపై ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవటంతోనే రోజుకొక విద్యా సంస్థలో నిధులు మాయం ఘటనలు పునరావృతమవుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. 2018లో ఖమ్మం నగరంలోని టేకులపల్లి డైట్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ రూ.2లక్షల 13వేలు కళాశాల నిధులను తన సొంత ఖర్చులకు వాడుకున్నాడు. అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా కేవలం నిధులను మాత్రమే రికవరీ చేసి అతడికి రెండు ఇంక్రిమెంట్లను నిలిపివేసినట్లు తెలిసింది. ప్రస్తుతం అతను జిల్లాలోనే మరో ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు. కారేపల్లి మోడల్ స్కూల్‌లో ఓ అకౌంటెంట్ ఫోర్జరీ సంతకాలతో రూ.26లక్షల ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసిన సంఘటన, భద్రాద్రి కొత్తగుడెం జిల్లా ఇల్లెందు మైనారిటీ పాఠశాలలో కొంత పాఠశాల



నిధులు, అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిప్రభుత్వ నిధులు సుమారు రూ.కోటి 80లక్షల వరకు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా ఆయా ఘటనల్లో నిధులు స్వాహా చేసిన వ్యక్తులపై జిల్లా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. ఇందులో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, మరికొందరు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్‌లో జరిగిన నిధుల స్వాహాలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొందరి సహకారంతోనే ఈ స్కామ్ జరిగినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. కాగా మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు సీనియర్ కన్సల్టెన్సీ అధికారి జి. విజయ్‌శంకర్, జూనియర్ అకౌంట్స్ అధికారి బాలజయశంకర్ పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా వాటిల్లో మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ నిధులు స్వాహా అయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు పూర్తి వివరాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నారని, ఆ తరువాతే అసలు దోషులు బయటికి రానున్నారని తెలుస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన నిధుల్లో గుట్టు చప్పుడు కాకుండా జిల్లా అధికారుల కళ్లుగప్పి రూ.కోటి 80లక్షలను బ్యాంక్ ద్వారా వారి వ్యక్తిగత అకౌంట్‌లకు బదిలీ చేసుకుంటున్నా ఇటు బ్యాంక్ అధికారులు కానీ, విద్యాశాఖ అధికారులు కానీ గుర్తించకపోవటం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల నిధులు పక్కదారి పట్టకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, ఆ నిధలును కేవలం విద్యా సంస్థల అభివృద్ధికే వినియోగించాలని విద్యార్థుల తల్లితండ్రులు అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల నిధులు స్వాహా చేసిన వ్యక్తులను, అందుకు సహకరించిన అధికారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

స్పాంజ్ ఐరన్ ప్లాంట్లను ప్రారంభించండి

● కేంద్ర ఉక్కుశాఖ మంత్రికి తాండ్ర వినోదరావు వినతి



ఉక్కు శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు వినతి పత్రం అందిస్తున్న తాండ్ర వినోదరావు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 11: ఖమ్మం జిల్లాకు తలమానికమైన పాల్వంచ స్పాంజ్ ఐరన్ ప్లాంట్‌ను పునఃప్రారంభించాలని బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆయన హైదరాబాదులోని ఉక్కు శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, హెచ్‌డీ కుమారస్వామి, స్టీల్, అండ్ హెవీ ఇండస్ట్రీస్ మంత్రులను కలిసి పాల్వంచ స్పాంజ్ ఐరన్ యూనిట్ గురించి వినతిపత్రం అందించారు. గతంలో సిల్‌లో 500 మంది ప్రత్యక్ష ఉద్యోగులు, పరోక్షంగా 5,000 మంది కార్మికులు గతంలో జీవనోపాధి పొందారని తెలిపారు. ఉత్పత్తిలో ఉత్తమ సహకారానికి హామీ ఇవ్వడం ద్వారా ఎన్‌ఎండీసీ ఎస్‌ఐయూన్ని పునరుద్ధరించడం స్పాంజ్ ఐరన్ నుంచి కార్మికులు తమ జీవనోపాధిని పొందుతారని అదే విధంగా యూనిట్ నుంచి మరింత ఇనుమును ఉత్పత్తి చేయడానికి చాలా ప్రయోజనం ఉంటుందని తెలిపారు. పరిశ్రమ అవసరాలు ప్రస్తుతం ఎన్‌ఎండీసీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

40 టన్నుల క్రేన్‌ను ప్రారంభించిన జీఎం

మణుగూరు, జూలై 11: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో గురువారం ఓసీ-2 గనిలో మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ 40 టన్నుల టైర్ మౌంటెడ్ రఫ్ టెర్రైయిన్ భారీ క్రేన్‌ను ప్రారంభించారు. ట్రాక్టర్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ చెందిన ఈ క్రేన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొంది ఉంది. రూ 1.44 కోట్ల ను వెచ్చించి ఈ భారీ యంత్రాన్ని యాజమాన్యం కొనుగోలు చేసింది. ఏరియా అవసరాల దృష్ట్యా ఈ క్రేన్‌ను యాజమాన్యం కేటాయించిద్దారు. దీంతో వృత్తి పరంగా అదనపు శక్తి చేకూరినట్లైందన్నారు. నిబంధనలు పాటిస్తూ క్రేన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఓ వెంకట రమణ, ప్రాజెక్టు అధికారి ఎస్ఎన్‌జీఓ సీత, ఏరియా ఇంజనీర్లు శ్రీనివాసచారి, వెంకట్‌రావు, మదన్ నాయక్; రాంబాబు, కార్మిక సంఘ నాయకులు రాంగోపాల్, గట్టయ్య కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



క్రేన్‌ను ప్రారంభిస్తున్న జీఎం దుర్గం రామచందర్

ముగిసిన ఎప్‌సెట్ ధ్రువీకరణ ప్రక్రియ

చుంచుపల్లి, జూలై 11: ఆరు రోజులుగా రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఎప్‌సెట్- 2024 అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఈ ప్రక్రియలో మొత్తం 2329 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని, హెల్ప్‌లైన్ సెంటర్ కో-ఆర్డినేటర్ బి.నాగముని నాయక్ తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్స్‌ను అభ్యర్థులు నమోదు చేసుకోవాలని, 19వ తేదీన సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని పేర్కొన్నారు. సీటు పొందిన అభ్యర్థులు కళాశాల రుసుము చెల్లించి, సీట్ పొందిన కళాశాలలో ఈ నెల 23వ తేదీ లోపు రిపోర్ట్ చేయాలని సూచించారు.

మొరాయించిన సర్వర్

● రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఈకెవైసీ సమస్య

చుంచుపల్లి, జూలై11: భద్రాద్రి జిల్లాలో సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం నిలిచిపోయింది. ఈ ప్రక్రియలో క్రయ, విక్రయాలు చేసే అభ్యర్థుల ఫోటోలు సేకరించే సాంకేతిక కారణాల వల్ల ఈకెవైసీ సమస్య తలెత్తింది. అదేవిధంగా రిజిస్ట్రర్ లాగిన్ అయ్యేందుకు అవకాశం లేకపోవడంతో కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

భద్రాద్రి దేవస్థానంలో బదిలీలకు రంగం సిద్ధం

- ఉద్యోగులకు ఆప్షన్ ఫామ్‌ల అందజేత
- భారీగానే బదిలీలు జరగొచ్చంటున్న ఉద్యోగ వర్గాలు

భద్రాచలం, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వంవ అన్ని ప్రభుత్వ విభాగాల్లో బదిలీలకు తెరలేపవడంతో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలోనూ సుదీర్ఘకాలం తరువాత ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉద్యోగులకు ఐదు ఆప్షన్లను ఇచ్చి వారు కోరుకునే ఐదు స్థానాలను ప్రాధాన్యత రీత్యా ఇవ్వాలని దేవాదాయ శాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు ఇందుకు సంబంధించి నమూనాలను సైతం రూపొందించి భద్రాద్రి దేవస్థానం అధికారులకు పంపినట్లు తెలిసింది. దీంతో దేవస్థానం అధికారులు తమ దేవస్థానం పరిధిలోని 76 మంది పరిపాలన, వైదికఉద్యోగులకు ఇందుకు సంబంధించిన వివరాలను అందజేయాలని సూచించినట్లు సమాచారం. దేవస్థానంలో 36 మంది పరిపాలన సిబ్బంది, 39మంది వైదిక, వాయిద్య సిబ్బంది ఉన్నారు. వీరికి ప్రాధాన్యత రీత్యా తాము కోరుకుంటున్న స్థానాలను తెలుపుతూ వెంటనే వివరాలు అందించాలని ఆదేశించడంతో ఇందులో కొంతమంది ఇందుకు సంబంధించిన ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది.

అందరి నోట బదిలీల మాటే

సుమారు దశాబ్దన్నర తరువాత భద్రాద్రి దేవస్థానంలో ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం కావడంతో దేవస్థానంలో పనిచేసే పరిపాలన, వైదిక సిబ్బంది ఏ నోట విన్నా బదిలీల మాటే వినిపిస్తుండటం గమనార్హం. ఇప్పటికే కొంతమంది పరిపాలన సిబ్బంది తమకు బదిలీ తప్పకపోవచ్చు అనే భావనతో ఉన్నారు. మరికొంత మంది ప్రభుత్వం 40శాతం మేరకే బదిలీలు నిర్వహించాలని ఆదేశించడంతో అందులో తమ పేరు ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఎంతమందికి స్థానచలనం కలుగుతుందనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.



29వరకు షెడ్యూల్ పొడిగింపు

దేవాదాయ శాఖలో బదిలీల ప్రక్రియ షెడ్యూల్ 10నుంచి 29 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉద్యోగుల సీనియార్టీ జాబితాల తయారీ ప్రకటన, ఖాళీలు తదితర వివరాలను 14లోపు అందించాల్సి ఉంటుంది. అలాగే ఉద్యోగులు తమ ఆప్షన్లను ఇస్తూ 19లోపు సమర్పించాల్సి ఉంటుంది. 27వరకు దరఖాస్తుల పరిశీలన, కౌన్సిలింగ్ అనంతరం తుది జాబితా తయారీ చేస్తారు. 28, 29 తేదీల్లో ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులు వెలువడనుండగా ఉద్యోగులు తమకు కేటాయించిన స్థానాల్లో చేరేందుకు వెళ్లాల్సి ఉంటుంది.

పశువులకు అజొల్లా మేతను అందించాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి. పురంధర్

జూలూరుపాడు, జూలై 11: రైతులు పశువులకు అజొల్లా గడ్డి(మేత)ను అందిస్తే అవి ఆరోగ్యంగా ఉండటంతో పాటు పాల ఉత్పత్తి, వెన్న శాతం గణనీయంగా పెరుగుతుందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి. పురంధర్ తెలిపారు. జూలూరుపాడులోని పశువైద్యశాల ఆవరణలో అజొల్లా గడ్డిని పెంచేందుకు ఏర్పాటుచేసిన పిట్‌లో గురువారం ఆయన సిబ్బందితో కలసి విత్తనాలను చల్లారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పశువులకు మేతను అందించే విషయంలో శ్రద్ధను కనబరచాలని తెలిపారు. దాన, పచ్చిమేతతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న అజొల్లా (పచ్చి) మేతను అందించాలని కోరారు. అదే విధంగా తెల్ల పశువుల్లో ముద్ద చర్మ వ్యాధి నివారణకు ఈ నెల 1 నుంచి జిల్లా వ్యాప్తంగా ఎల్ఎస్‌డీ టీకాలను, జీవాల్లో నీలి నాలుక వ్యాధి రాకుండా అరికట్టేందుకు ఈ నెల 15 నుంచి ఉచితంగా టీకాలను వేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పశుసంవర్ధక శాఖాధికారి గోపాలకృష్ణమూర్తి, మండల పశువైద్య అధికారి బద్దులాల్, అసిస్టెంట్ వైద్యాధికారి పూర్ణచందర్‌రావు, జేవీవోలు రాజేష్, యుగేందర్, బన్సీలాల్, సిబ్బంది రజని బాబు, నరసింహరావు, రామనాథం పాల్గొన్నారు.



విత్తనాలను చల్లుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి పురంధర్

భవిష్యత్ అంతా సాంకేతిక పరిజ్ఞానానిదే

● ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, జూలై 11: భవిష్యత్ అంతా సాంకేతిక పరిజ్ఞానానిదేనని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని వీకేడీవీఎస్ రాజు కళాశాలలో హైదరాబాదుకు చెందిన అడోబ్ కంపెనీ వారి ప్లోబస్ సీఈఓ మధులాష్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్‌వీల్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రోగ్రాంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ ఐదేళ్లలో తన నియోజకవర్గానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు రావాలని, నియోజకవర్గం నుంచి ఎందరో విద్యార్థులు సాంకేతికను అందిపుచ్చుకొని ఎంతో ఉన్నత స్థాయికి చేరడానికి తన వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్లోబస్ ఫౌండర్ మధులాష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ గురించి ఎంతో సమాచారాన్ని అందజేశారు. కార్యక్రమంలో చక్కటి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

వరిసాగులో నారుమడి కీలకం

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి ● కలుపు నివారణపై దృష్టిసారించాలి



ఖమ్మం వ్యవసాయం, జూలై 11: వానాకాలం వ్యవసాయసీజన్ ప్రారంభమైంది. నీటి వసతి, ప్రాంతాన్ని బట్టి చీడపీడలను తట్టుకునే వరి విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసిన రకాల కాలపరిమితిని బట్టి నిర్ణీత సమయంలో నారు వేసుకోవాలి, దీర్ఘకాలిక రకాలు 140రోజుల కన్నా ఎక్కువ, జూన్ తర్వాత, మధ్య స్వల్పకాలిక రకాలు, 110 నుం చి 135 రోజులు, జులై 15 వరకు స్వల్పకాలిక రకాలు జూలై చివరి వరకు నారు పోసుకోవచ్చు. ఎకరా సాగుకు సన్నరకం 20 కిలోల వాడాలి, దొడ్డు రకానికి 25కిలోలు వాడాలి.

● విత్తనశుద్ధి తప్పనిసరి

నారుపోసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. తడి విత్తనశుద్ధికి కార్బండిజిమ్ 1గ్రాము, పొడి విత్తనశుద్ధికి 3 గ్రాముల మందును కిలో విత్తనానికి చొప్పున కలిసి విత్తుకోవాలి. బెంగాలీ నాట్లయితే 10 నుంచి 15 కిలోల విత్తనం సరిపోతుంది. నారుమడి ఐదు సెంట్లకు 22 కిలోలు యూరియా, 6.25 కిలోల సూపర్, 1.6 కిలోల పొటాష్ వేసుకోవాలి.

● చల్లుకోవడంలో మెళకువలు..

విత్తనం ఒత్తుగా చల్లుకున్నట్టు అయితే నారు పెరుగుదల బలహీనంగా ఉంటుంది. విత్తనం పలచగా చల్లాలి. మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, వారం రోజులు ఆరుతడులు, ఆ తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి.

● జింక్ లోపాన్ని గమనించాలి

జింకు లోప నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. మెట్ట నారుమడిలో ఇనుపధాతు లోపాన్ని గమనిస్తే సరిచేయాలి. పంట, ఎదుగుదలను బట్టి 2 గ్రాముల నుంచి 5 గ్రాముల అన్నభేది, 0.5 నుంచి ఒక గ్రాము నిమ్మ ఉప్పు లీటరు నీటికి పిచికారీ చేయాలి. నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రెండో దఫా నత్రజని ఆలస్యంగా వేసి నారు ముదరకుండా చూడాలి.

● కలుపు నివారణ

నారుమడిలో ఒకట్రెండు రోజుల్లో ప్రిటిలాక్లోర్ 50 శాతం ఈసీ రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలపాలి. ఎకరాకు 400 మిల్లీలీటర్లు చల్లుకోవాలి. మూడు నుంచి ఐదు రోజుల్లో ఫైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 10 శాతం డబ్ల్యూపీ 80 గ్రాములు ఎకరాకు వేసుకోవాలి. 15 నుంచి 20 రోజుల్లో బిస్పిరిబాక్ సోడియం 100 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. అవసరాన్ని బట్టి నారుమడికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాట్లు వేసిన పొలంలో మూడు నుంచి ఐదు రోజుల్లో ఫైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రాముల ఎకరాకు, 15 నుంచి 20 రోజుల్లో సెహలోఫాప్‌బ్యూటైల్ 10 శాతం ఈసీ 400 ఎంఎల్ ఎకరాకు చల్లుకోవాలి.

● ముందు జాగ్రత్తలు

నాట్లు వేయడానికి 15 రోజులు ముందుగానే పవర్ టిల్లర్లు లేదా ట్రాక్టర్‌తో 15 సెంటీమీటర్ల లోతున దమ్ము చేసుకోవాలి. ఎరువులు 36-24-24 ఎన్‌పీకే లు అనగా ఒక ఎకరాకు 80 కిలోల యూరియా మూడు దఫాలుగా, సింగ్ సూపర్‌ఫాస్ఫేటు 150 కిలోలు, 40 కిలోల పొటాష్ రెండు దఫాలుగా నాట్లు వేసిన వరి చేలకు వేయాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటలు తీసుకోవాలి.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి: డీఈవో



బహుమతులు అందజేస్తున్న డీఈవో సోమశేఖరశర్మ

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 11: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈవో సోమశేఖరశర్మ అన్నారు. గురువారం నగరంలోని జిల్లా సైన్స్ మ్యూజియం సైన్స్ సెంటర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలలో భాగంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్, ఖమ్మం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో- జిల్లాలోని అన్ని పాఠశాలల ఎనిమిది, తొమ్మిదొవ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి కవితలు, పోస్టర్ తయారీ పోటీలు, పర్యావరణ అవగాహన సదస్సును నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పలు అంశాలపై విద్యార్థులు సందేశాత్మకమైన కవితలను, వివిధ రకాల పోస్టర్స్‌ను స్వయంగా కళాత్మకంగా రూపొందించారని జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ తెలిపారు. ముగింపు కార్యక్రమానికి డీఈవో సోమశేఖర శర్మ, ఎంఈవో శ్రీనివాస్, డీసీఈబీ సెక్రటరీ విచ్చేసి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణం పట్ల సరియైన దృక్పథాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. జిల్లా ఎన్జీసీ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచే పలు రకాల సైన్స్ కార్యక్రమాలను ప్రతీ విద్యా సంవత్సరం నిర్వహిస్తామని తెలిపారు.

కవితల విభాగంలో ప్రథమ స్థానంలో శ్రీభాస్కర మోమోరియల్ హైస్కూల్, వై. హర్షిణి ద్వితీయ జడ్పీహెచ్ఎస్ సింగరాయపాలెం పాఠశాల విద్యార్థి నవదీప్, తృతీయ స్థానంలో సయ్యద్ ఆయేషా ఆనియా హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. పోస్టర్ తయారీలో ప్రథమ స్థానంలో జడ్పీహెచ్ఎస్ జల్లేపల్లి పాఠశాల విద్యార్థి తులసిప్రియ, ద్వితీయ నాగప్రసన్న హార్వెస్ట్ పాఠశాల, తృతీయ త్రివేణి జడ్పీహెచ్ఎస్ గుదిమళ్ల పాఠశాలల విద్యార్థులు గెలుపొందారు. విజేతలకు వారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ తయారీ న్యాయనిర్ణేతలుగా ఊటుకూరు శ్రీనివాస్, మొహమ్మద్ షఫీ, కవితలకు ఎనుముల వెంకటేశ్వర్లు, గాజుల భారతి ఆదిత్య వ్యవహరించారు.

'సింగరేణిలో అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి'

ఇల్లెందు, జూలై 11: సింగరేణిలో గత ప్రభుత్వం జరిపిన అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తెయ్య, ఏబీకేఎంఎస్ కార్యదర్శి వేజ్‌బోర్డు సభ్యులు పి.మాధవ్ నాయక్‌లు డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ 28వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 14న శ్రీరాంపూర్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 27సంవత్సరాలుగా సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం బీఎంఎస్ నాయకత్వంలో అనేక ఉద్యమాలు నిర్వహించామన్నారు. సింగరేణిలో జరిగిన అవినీతి అక్రమాలపై నిధుల దుర్వినియోగంపై సీబీఐ లేదా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ లేదా సిట్ ద్వారా దర్యాప్తు జరిపించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈనెల 14న శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్ కాలనీ సీఈఆర్ క్లబ్‌లో జరుగనున్న కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ రాష్ట్ర మహాసభలో కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, వేజ్‌బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుధీర్ గురుడే, బీఎంఎస్ రాష్ట్ర నాయకులు పులి రాజారెడ్డి, తూర్పు రాంరెడ్డి, రాష్ట్ర సంఘటన కార్యదర్శి రాంమోహన్, మండ రమాకాంత్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. సింగరేణి కాలరీస్ కార్మికులు రాష్ట్ర మహాసభకు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలపై అధికారుల పరిశీలన

● తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలపై సమీక్ష



పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు, జూలై 11 వర్షాకాల సీజన్ ప్రారంభమైనందున మండంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు లోపించడం, కలుషిత మంచినీటి ప్రభావంతో సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో పలువురు జ్వరాలు సోకి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. కల్లూరులో 'విజృంభిస్తున్న విష జ్వరాలు' అనే శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనంపై జిల్లా స్థాయిలో భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖ పంచాయితీరాజ్ శాఖల అధికార యంత్రాగం స్పందించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ సదాశివకుమార్, గ్రీడ్ ఇఈ వాణిశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పుష్పలతలు క్షేత్ర స్థాయిలో మంచినీటి పథకాల ద్వారా మంచినీటి సరఫరా తీరును పరిశీలించారు. అదే విధంగా క్లోరినేషన్ జరుగుతున్న విధానం, మంచినీటి పథకాల పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శి కృష్ణారావును వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరాల బారీన పడుతున్న విషయమై సమాచారం అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్, గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో సమావేశమైన అధికారులు పారిశుద్ధ్య కార్యక్రమాల మెరుగుపరచడంతో పాటుగా, తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ప్రధాన రహదారుల పక్కన మురికి నీటి కాల్వలను పరిశుభ్రత, పూడిక తీత, దోమల నివారణకు ఫాగింగ్, టీమోపాస్ వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారు. వైద్యశాఖ తరుపున గ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించడం, క్షేత్ర స్థాయిలో ఇంటింటా తిరిగి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టారు. ఈ సమావేశాల్లో వైద్యాధికారి నవ్యకాంత్, ఈవోఆర్డీ సురేష్‌బాబు, కార్యదర్శి కృష్ణారావు గ్రిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రమేష్ పాల్గొన్నారు.

నేడు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

హుస్సేన్‌నాయక్ ఖమ్మం రాక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, జూలై11: నేడు నేషనల్ ట్రైబుల్ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ శుక్రవారం ఖమ్మం జిల్లాకు రానున్నారని ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ గురువారం తెలిపారు. అధికార పర్యటనలో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే అధికారిక కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌ను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. గిరిజనుల సమస్యలపైనా, గిరిజన ఉద్యోగుల సమస్యలపై, ప్రజాసమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి పరిశీలిస్తారని తెలిపారు.

భద్రాద్రిలో 13న పర్యటన

పాల్వంచ టౌన్, జూలై11: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ ఈ నెల 13న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నట్లు బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం పాల్వంచలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 13వ తేదీ ఉదయం సారపాక ఐటీసీ బీపీఎల్ కర్మాగారాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడుతారని, అనంతరం గిరిజన సంఘాలతో కలిసి వారి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. అనంతరం పాల్వంచలోని నవభారత్ కర్మాగారాన్ని సందర్శించి అక్కడ అధికారులతో చర్చిస్తారని తెలిపారు. అనంతరం స్థానిక గిరిజనుల సమస్యలు అడిగి తెలుసకుంటారని తెలిపారు. సాయంత్రం 3గంటలకు జెన్కో సందర్శన, అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం అనంతరం 7గంటలకు పాల్వంచ మున్సిపల్ రోడ్డులో గల గణేష్‌సాయి కన్వెన్షన్ హాలులో గిరిజన సంఘాలు, అభిమానులచే, అభినందన, సన్మాన సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెర్వు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు రపాక రమేష్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు భూక్య రవినాయక్, అలుఆల సందీప్, గంగపురి దుర్గా ప్రసాద్, గంధం నాగేంద్ర ప్రసాద్, ఎస్సీ మోర్చా టౌన్ ప్రెసిడెంట్ కల్లోజు నాగరాజు, బట్టి శివ, తాటికొండ కళ్యాణ్, టి. అవినాష్ తదితరులున్నారు.

కొత్తగూడెం మెడికల్ కళాశాల

ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు బదిలీ...?

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై11: కొత్తగూడెం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆర్.ఎల్.లక్ష్మణ్‌రావు గురువారం బదిలీ అయినట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర హెల్త్ అండ్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టీనా ఉత్తర్వులు విడుదల చేసినట్లు సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టాయి. గతంలో హైదారాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్‌రావును కొత్తగూడెం ఇన్ చార్జి ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డి ఎమ్ఈ) నుంచి ఎటువంటి అధికారిక ఉత్తర్వులు వెలువడకపోవడంతో బదిలీ అయినట్లా.. లేనట్లా అనేది సందిగ్ధం నెలకొంది. ఈ బదిలీపై ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న లక్ష్మణ్‌రావుకు అధికారికంగా ఎటువంటి సమాచారం కానీ...ఈ-మెయిల్ కానీ రాలేదని ఆంధ్రజ్యోతికి తెలిపారు.

సత్తుపల్లిలో డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

సత్తుపల్లిరూరల్, జూలై11: కారును తప్పించబోయి లారీ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టి ఆగిన సంఘటన సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్న లారీ పట్టణంలో కారును తప్పించబోయి పాత సెంటర్ డివైడర్‌ను ఢీకొట్టి ఆగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదంలో ఎవ్వరికి గాయాలు కాలేదు. పోలీసులు ప్రమాదస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వైరా, జూలై 11: వైరాలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని మతిస్థిమితం లేని వ్యక్తి ఓ దుకాణం ముందు పడిపోయి ఉండగా, బస్ స్టేషన్ కంట్రోలర్ తేజావత్ నాగేశ్వరరావు 108వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆవ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 30నుంచి 35సంవత్సరాలు ఉంటుందని, నలుపురంగు కలిగి, నీలంరంగు నిక్కర్ ధరించి, హిందీ భాష మాట్లాడేవాడని సమాచారం. నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ కారు డ్రైవర్..

మధిరరూరల్, జూలై 11: మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామం వద్ద మంగళవారం రాత్రి కారు ఫల్టీకొట్టిన ప్రమాదంలో కారు డ్రైవర్ అంకె రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా గురువారం తెల్లవారుజామున ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆటో ఫల్టీ: ముగ్గురికి గాయాలు

వైరా, జూలై 11: ప్రమాదశాత్తూ ఆటో ఫల్టీ కొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని సోమవరం గ్రామసమీపంలో వైరా-జగ్గయ్యపేట రోడ్డులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపూడి నుంచి వైరా వస్తున్న ఆటో ముందు వెళ్తున్న వాహనాల వేగం తగ్గిన సమయంలో ఆటోను అదుపుచేసే ప్రయత్నంలో ఫల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108వాహనంలో ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న జగ్గయ్యపేట ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదాన్ని పసిగట్టి సమయస్ఫూర్తితో వ్యవహరించడం వలన త్రుటిలో పెను ప్రమాదం తప్పిపోయింది.

అశ్వారావుపేటలో ట్రాక్టర్ చోరీ

అశ్వారావుపేట, జూలై 11: ఇంటి ముందు ఉన్న ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన పట్టణంలోని వడ్డెరబజార్‌లో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లెపు వెంకన్నబాబుకు చెందిన ఏపీ 37టీకే 2406 నెంబర్ గల ట్రాక్టర్‌ను ఇంటి ముందు పెట్టి నిదరపోయారు. బుధవారం తెల్లవారి జామున చూసుకునే సరికి ట్రాక్టర్ కనిపించలేదు. రోజంతా వెతికినా కనిపించలేదు. గురువారం ట్రాక్టర్ కనిపించకుండా పోయినట్లు బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్ విలువ రూ.5లక్షలు ఉంటుందని వెంకన్నబాబు తెలిపాడు. ట్రాక్టర్‌ను కిరాయికి తిప్పుకొని జీవనం సాగిస్తుంటానని, ట్రాక్టర్‌ను ఎత్తుకొని పోవడంతో జీవనోపాధిని కోల్పోయినట్టు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బూర్గంపాడు, జూలై 11: బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. బుధవారం రాత్రి సమయంలో ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా, ఆరుగురిని ఆదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,260లు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

బూర్గంపాడు, జూలై 11: బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో గురువారం దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సారపాక పంచాయతీలో గల మేడే కాలనీకి చెందిన గుగులోతు వీరన్న సారా అమ్ముతూ ఉంటాడని తెలిపారు. ఈ క్రమంలో తరచుగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహిస్తున్న సమయంలో అతడు పట్టుబడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో వీరన్న పట్టుబడటానికి తన ఇంటి ఎదురుగా ఉన్న సరోజ అనే మహిళ కారణమని ఆమెను దూషించేవాడని తెలిపారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి సమయంలో బయటకు వెళ్తున్న ఆమెపై వీరన్న దాడికి పాల్పడ్డాడు. గురువారం బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

కామేపల్లి, జూలై 11: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బర్లగూడేనికి చెందిన భూక్య నందకు చెందిన ఆవు మేత మేయడానికి వెళ్లి ఓ రైతు పొలంలో తెగిపడిన విద్యుత్ తీగ తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ.50వేల రైతు వాపోయాడు

భద్రాద్రి జిల్లాకు 'హైవే' కళ

▸ జగ్గయ్యపేట టూ కొత్తగూడెం మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చాలని ప్రతిపాదనలు

▸ హైదరాబాద్ టూ మహబూబాబాద్ మీదుగా కొత్తగూడేనికి జాతీయ రహదారి

▸ మంత్రి తుమ్మలతో చొరవతో భద్రాద్రి జిల్లాకు తీరనున్న కష్టాలు



కొత్తగూడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నలువైపుల నుంచి అన్ని ప్రధాన రోడ్డు మార్గాలు జాతీయ రహదారులుగా నిర్మాణం కాబోతున్నాయి. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విజయవాడ నుంచి వయా తిరువూరు మీదుగా పెనుబల్లి, చంద్రుగొండ, కొత్తగూడెం మీదుగా భద్రాచలం వరకు జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. దీనిలో భాగంగా భద్రాచలం గోదావరి నదీ మీద నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు.

ఈ జిల్లాకు జాతీయ రహదారుల ప్రధాన రోడ్డు మార్గాలకు అన్నివైపుల నుంచి ఉండాలని నేషనల్ హైవే అధికారులతో కేంద్ర ప్రభుత్వ ఉపరితలశాఖ మంత్రితో గత పదేళ్ల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందినటువంటి ప్రస్తుత వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని జిల్లాకు కావాల్సిన జాతీయ రహదారుల నిర్మాణానికి విశేషంగా కృషి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్ర జాతీయ రహదారులపై నేషనల్ హైవే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూడా మరో జాతీయ రహదారి నిర్మాణానికి అంకురార్పణ కానుంది.


జగ్గయ్యపేట నుంచి వయా బోనకల్, వైరా, తల్లాడ మీదుగా ఏన్కూరు, జూలూరుపాడు, సుజాతనగర్ మీదుగా కొత్తగూడెం వరకు జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని, వెంటనే మంజూరు చేయాలని మంత్రి తుమ్మల సీఎం రేవంత్ రెడ్డి ద్వారా నేషనల్ హైవే అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అదే కాకుండా భువనగిరి నుంచి వయా వలిగొండ, తొర్రూరు, మహబూబాబాద్ నుంచి ఇల్లెందు మీదుగా కొత్తగూడెం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు సైతం మంజూరయ్యాయి. ఈ జాతీయ రహదారికి తొర్రూరు వరకే టెండర్లు జరిగి పనులు కొనసాగుతున్నాయి.

అదేవిధంగా ఖమ్మం నుంచి అశ్వరావుపేట వెళ్లే జాతీయ రహదారికి కూడా మరమ్మతులు చేపట్టాలని ఎన్‌హెచ్ అధికారులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. మొత్తం మీద జిల్లాకు ఇటు ఆంధ్రప్రదేశ్ ఆటు ఛత్తీస్‌గఢ్ ఇటు రాష్ట్రంలోని జాతీయ రహదారి మార్గాలకు కలుపుతూ ఈ జిల్లాకు నలుమూలల జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. దీంతో పాటుగా ఇటీవల కాలంలో జాతీయ రహదారి నిర్మాణంగా కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఒక రింగ్‌రోడ్డు కూడా మంజూరు చేశారు.

కొత్తగూడెం సమీపంలోని ఇల్లెందు రోడ్డులోని అనిశెట్టిపల్లి వద్ద నుంచి పాల్వంచ ప్రాంతంలోని పెద్దమ్మగుడి జగన్నాథపురం వరకు రింగ్ రోడ్డు నిర్మాణం త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు. మొత్తం మీద జాతీయ రహదారులు పూర్తి స్థాయిలో అన్ని వైపుల నిర్మాణాలు జరిగితే జిల్లా ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాలతో మరింత సంబంధాలు కలిగి జిల్లా అభివృద్ధికి నోచుకునేందుకు ఈ జాతీయ రహదారి నిర్మాణాలు ఎంతో ఉపయోగపడతాయి.

పలు గ్రామాల్లో రేషన్ బియ్యం పట్టివేత



ఇల్లెందులో రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

సీఎస్పీ గ్రామంలో 25క్వింటాలు...

ఇల్లెందురూరల్, జూలై11: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఇల్లెందు మండలం సీఎస్‌పీ బస్తీ గ్రామపంచాయతీ రైల్వే గేట్ సమీపంలో బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ గురువారం తెలిపారు. పూసపల్లి నుంచి లచ్చగూడేనికి బోలెరో వాహనంలో 25క్వింటాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నరన్న సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్ బత్తుల నవీన్, బత్తుల సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టేకులపల్లిలో 35క్వింటాలు....

టేకులపల్లి, జూలై 11: రేషన్ బియ్యాన్ని ట్రాలీ వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా గురువారం టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మండలంలోని మద్రాసుతండాకు చెందిన రేషన్ దుకాణం నుంచి రేషన్ దుకాణం డీలర్ మాలోతు రాజేందర్, రేషన్ వ్యాపారి చక్రాల నర్సింహారావులు ట్రాలీ వాహనంలో అక్రమంగా 35క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా, రేషన్ షాపు సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన రేషన్‌బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. రేషన్ దుకాణం డీలర్ రాజేందర్, వ్యాపారి నర్సింహారావు, వాహనం డ్రైవర్ పెద్దబోయి న సాయి భరత్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సహకరించిన కొండంగులబోడు గ్రామానికి చెందిన సుందర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అజ్మీరతండాలో 50 క్వింటాలు...

తిరుమలాయపాలెం జూలై 11: అక్రమంగా నిల్వ ఉంచిన 50 క్వింటాళ్ల రేషన్ బియాన్ని సమాచారంతో తిరుమలాయపాలెం తహసీల్దార్ రామకృష్ణతో పాటు సిబ్బంది పట్టుకున్న సంఘటన మండల పరిధిలో అజ్మీరతండాలో చోటుచేసుకుం ది. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. అజ్మీరతండా గ్రామంలో అక్రమంగా బోడరాము ఇంట్లో పిండిప్రోలు గ్రామానికి చందిన అంగడి సురేష్ అనే వ్యక్తి 100 బస్తాలలో సుమారు 50 క్వింటాళ్ల బియాన్ని ఇంట్లో నిల్వ చేయగా, సమాచారం మేరకు పట్టుకొని స్వాధీనపర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఆ బియాన్ని సేఫ్ కస్టడీ కింద ఓ ఇంట్లో భద్రపరిచినట్లు తెలిపారు. నిల్వ చేసిన అంగడి సురేష్, బోడ రామా పై కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వఉంచినా, విక్రయించినా కేసులు నమోదుచేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రేషన్ బియాన్ని పట్టుకున్న వారిలో ఆర్ఐ వీరయ్య, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఏఎస్ఐ మృతి



భరోతు పూసి(ఫైల్)

కల్లూరు, జూలై 11: కల్లూరు పంచాయతీ పరిధిలో గల ఖాన్‌ఖాన్‌పేట గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఏఎస్ఐ భరోతు పూసి (68) మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 6 గంటల సమయంలో ఏఎస్ఐ ఖాన్‌ఖాన్‌పేట ప్రధాన రహదారిపై నుంచి తన ఇంటి వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, సత్తుపల్లి వైపు నుంచి వస్తున్న కారు అదుపు తప్పి అదే గ్రామానికి చెందిన మారబోయిన కృష్ణప్రసాద్ ద్విచ్రవాహనాన్ని ఢీకొట్టూ వెళ్లి, రహదారి ప్రక్కన ద్విచక్రవాహనంపై ఆగి ఉన్న ఏఎస్ఐని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏఎస్ఐ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తీవ్ర గాయాలైన కృష్ణప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఖాన్‌ఖాన్‌పేటకు చెందిన పూసి గతంలో సత్తుపల్లి పోలీసు బెటాలియన్‌లో ఏఎస్ఐగా పని చేసి ఉద్యోగ విరమణ చేశాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో

వృద్ధుడి ఆత్మహత్య

కామేపల్లి, జూలై 11: అనారోగ్య సమస్యలతో ఓ వృద్ధుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గోవింద్రాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గోవింద్రాలకు చెందిన అంగోత్ రాములు (70) కొద్ది కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అప్పటి నుంచి మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య మంత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

దూషించిన ఘటనపై ఇద్దరిపై కేసు

బూర్గంపాడు, జూలై 11: భజరంగ్‌దళ్ సభ్యులను దూషించిన ఘటనలో గురువారం బూర్గంపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకకు చెందిన పారుఖ్, పయాజ్ అనే ఇరువురు వ్యక్తులు భద్రాచలం నుంచి సారపాక వైపునకు ఆవులను తోలుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో భజరంగదళ్ సభ్యులు సారపాకకు చెందిన పొదిలి మణిశేషు, భద్రాచలానికి చెందిన అజయ్ వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెబుతూ, పశువులను పాత సారపాక వద్దకు తోలుకు వచ్చి అక్కడ ఓ ప్రదేశంలో కట్టివేసి వెళ్లినట్లు తెలిపారు. కొంత సమయం తర్వాత పశువులకు వద్దకు వచ్చిన పారుఖ్, పయాజ్‌తో పాటు మరి కొంతమంది అక్కడే ఉన్న భజరంగ్‌దళ్ సభ్యులను దూషించి, రెండు ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడి దొంగల అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఎస్ఐ నరేష్

ముదిగొండ, జూలై 11: దారి దోపిడి దొంగలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 8వతేదీ అర్ధరాత్రి రామాంజనేయులు అనే వ్యక్తిని బెదిరించి బైక్, స్మార్ట్ ఫోన్‌ను ముదిగొండ మండలం వనంవారిక్రిష్టాపురం వద్ద ముగ్గురు దొంగలు దోపిడీ చేశారు. గురువారం లక్ష్మీపురం హైవే వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉండడంతో వారిని పట్టుకొని విచారించగా, దారి దోపిడీ ఘటనలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారన్నారు. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామానికి చెందిన పోతురాజు, ఎంవెంకటాపాలేనికి చెందిన మందాటి అజయ్‌కుమార్, బొబ్బిల్ల లోకేష్‌ను అదుపులోకి తీసుకొని వారి నుంచి బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

బైక్.. మోటార్ల చోరీ

సత్తుపల్లిరూరల్, జూలై11: సత్తుపల్లి పట్టణంలోని శ్రీనివాసా టాకీస్ రోడ్డులో ఓ వ్యక్తి ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకు వెళ్లాడు. బైక్‌ను స్టార్ట్‌చేసి ఎంచక్కా ఉడాయించిన సంఘటన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అవ్వడంతో ఆ వీడియోలు కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అదేవిధంగా బేతుపల్లి పెద్ద చెరువులోని మోటార్లు మాయమైనట్లు సమాచారం. ఇటీవల నూతనంగా నిర్మించి ఘాట్ సమీపంలోని ఇంకా ప్రారంభించని వాటర్ ట్యాంక్‌లో ఉంచిన మోటార్లు అపహరణకు గురైనట్లు తెలిసింది. ఈ విషయమై సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నం చేయగా స్పందించలేదు.

ఉత్తమ రిపోర్టర్ పురస్కారం

● మంత్రి ఉత్తమ్‌కుమార్ చేతులు మీదుగా పురస్కారం అందజేత


అవార్డు స్వీకరిస్తున్న దృశ్యం

భద్రాచలం జూలై 11: సీనియర్ పాత్రికేయులు, దిహన్స్ ఇండియా ఆంగ్ల దినపత్రిక ఖమ్మం స్టాప్ రిపోర్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న పీవీ సత్యనారాయణకు ఉత్తమ రిపోర్టర్ పురస్కారం దక్కింది. ఈ మేరకు ఉత్తమ పరస్కారాన్ని రాష్ట్ర నీటి పారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన ఓ మీడియా సంస్థ 2024 అవార్డుల కార్యక్రమంలో సత్యనారాయణకు అవార్డును అందించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల కథనాలతోపాటు, మానవీయ కథనాల ఆధారంగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. సత్యనారాయణ భద్రాచలంకు చెందిన వారు .

సైడ్ డ్రెయిన్లు లేక అవస్థలు

- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు


సుజాతనగర్ మెయిన్ రోడ్ వద్ద నీటి నిల్వ ఉన్న దృశ్యం (ఫైల్)

సుజాతనగర్, జూలై 11 : సుజాతనగర్ మండల కేంద్రంలో సైడ్ డ్రెయిన్లు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సుజాతనగర్ మండల కేంద్రంలో ఏళ్లు గడుస్తున్నా సైడ్ డ్రైన్‌కు శాశ్వత పరిష్కారం లేక ప్రజలు నానా బాధలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు మెయిన్ రోడ్‌లో నాళాలు లేక మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజా రవాణాకు అంతరాయం కలుగుతుంది. అంతే కాకుండా విష జీవాలు కూడా బయటకు రావడంతో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు చిరు వ్యాపారులు సర్దుకుని ఇంటికి వెళ్లటమే నని, వ్యాపారాలు సాగక, మురుగునీటి దుర్గంధం, విష సర్పాల భయంతో ఇంటికి వెళుతున్నామని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రుల వంటి వారు సైడ్ డ్రెయిన్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు అమలు కాలేదు. మెయిన్ రోడ్ వెడల్పు చేపట్టారు. కానీ ఇంతవరకు సైడ్ డ్రైన్ నిర్మించలేదు. మెయిన్ రోడ్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు రోడ్ ఆక్రమణకు గురై, సరైన మురుగునీటి సౌకర్యం లేక ప్రజలు వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతకాల్సి వచ్చిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు రోడ్ వెడల్పు చేసి సైడ్ డ్రైన్ నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధిక జనాభా వల్ల వనరుల కొరత

- ప్రపంచ జనాభా దినోత్సవంలో డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 11: అత్యధిక జనాభా వలన వనరుల కొరత ఏర్పడుతుందని, ప్రజల్లో కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ సూచించారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. చిన్న కుటుంబాలు ... చింతలేని కుటుంబాలు అని, జనాభా పెరగడం వల్ల ఎన్నో సమస్యలు ఎదురౌతాయని అన్నారు. ఎక్కువ జనాభా కలిగి ఉండడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుందని, అందువలన కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ బాలాజీనాయక్, చైతన్య, స్పందన, మధువరుణ్, రాకేష్, డిప్యూటీ డెమో ఫైజ్ మోహినుద్దీన్, సిబ్బంది అన్న మేరి, విజయ్ కుమార్, బేబి, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ....

ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా కొత్తగూడెం సింగరేణి మహిళ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినిలకు గురువారం అవగాహన కల్పించారు. కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా శారద, యూనిట్ ఆఫీసర్ సునిత, అధ్యాపకులు ఆశా జ్యోతి, కృష్ణవేణి, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో న్యాయవాదిపై దాడికి న్యాయవాదుల నిరసన


మణుగూరులో నిరసన వ్యక్తంచేస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెం లీగల్/మణుగూరు, జూలై 11: సిద్దిపేటలోని న్యాయవాది ఎం. రవికుమార్‌పై సిద్దిపేట టూటౌన్ పోలీసులు దాడిని ఖండిస్తూ కొత్తగూడెం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లేకార్డ్స్‌తో గురువారం నిరసన తెలిపారు. బాధితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలుచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గాజుల రామమూర్తి, మనుబోతుల సత్యనారాయణ, షేక్ మహ్మద్‌ఖాసీం, బి. చిరంజీవరావు, సింగు ఉపేందర్, అరికెల రవికుమార్, మారపాక రమేష్, కాసాని రమేష్, లక్ష్మి, సరిత, ఎన్. ఉమా, బర్ల రాజశేఖర్, పి. నాగేశ్వరరావు, సీహెచ్. విజయ్‌కుమార్, పాండురంగ విటల్, యాసా యుగందర్ నాయుడు, శ్రీధర్, వేముల మధుకర్, ఎస్. రామకృష్ణ, అంకుష్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదులకు హెల్త్‌కార్డుల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన హెల్త్‌కార్డులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ న్యాయవాదులకు శుక్రవారం ఉదయం 11గంటలకు అందచేస్తారని భద్రాద్రి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ గురువారం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఆర్ రవిచంద్ర, సాదిక్‌పాషా, డి. రవికుమార్, ప్రవీణ్‌కుమార్, మహిళ రిప్రజెంటేటివ్ ప్రతిభ పాల్గొన్నారు.

మణుగూరు: సిద్దిపేటలో న్యాయవాదిపై పోలీసులు జరిపిన దాడిని తీవ్రంగా కండిస్తూ మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. నల్ల బ్యాడ్జీలను ధరించి ఆందోళన చేపట్టారు. రోజు రోజుకు పోలీసుల అనుచిత చర్యలు న్యాయవాదులపై ఎక్కువ అవుతున్నాయని ఇది ఏ మాత్రం సరికాదన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు బాధ్యులపై తగిన విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు.

ఎస్ఐ శ్రీను మృతికి బార్ సంతాపం

అశ్వారావుపేట/దమ్మపేట జూలై 11: అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ చిత్రపటానికి దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు. గురువారం దమ్మపేటలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఐ మరణం విచారించదగ్గదన్నారు. కార్యక్రమంలో ఉడతనేని శ్రీనివాసరావు, లక్కినేని నరేంద్రబాబు, గొంది మురళి, సంధ్య, సంజయ్, దుర్గావళి, బాలరాజు సంజయ్, దుర్గా వలీ, ఉదయ్, భవానీకృష్ణ పాల్గొన్నారు

నేడు ఛలో కలెక్టరేట్

భద్రాచలం, జూలై 11: ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఛలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు భూపేందర్ తెలిపారు. పెండింగులో ఉన్న స్కాలర్‌షిప్‌లు, రీయంబర్స్‌మెంటు విడుదల చేయాలన్నారు.

తుదిశ్వాస వరకు ప్రజల కోసమే విప్లవకారులు

● ఎన్డీ కేంద్ర కమిటీ కార్యదర్శి సాదినేని


మాట్లాడుతున్న సాదినేని

ఇల్లెందు, జూలై 11: నిబద్దత, విప్లవోద్యమాలకు అంకితమైన విప్లవ కారులు తుది శ్వాస వరకు ప్రజల కోసమే పనిచేస్తారని, ఎన్డీ జిల్లా నాయకులు ఎల్.విశ్వనాథం ఏజన్సీ ప్రజల కోసం పనిచేసి యోధుడని న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఎన్డీ జిల్లానేత ఎల్.విశ్వనాథం సంస్మరణ సభ ఇల్లెందు మండలం 21 ఏరియాలో జరిగింది. ఈ సభలో సాదినేని మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టిన విశ్వనాదం గిరిజనుల హక్కుల కోసం పోరాటాలు నిర్మించాడన్నారు. ఇఫ్టూ జిల్లా నాయకులు జె.సీతారామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, మాస్‌లైన్ నాయకురాలు చంద్ర అరుణ, ఎన్డీ నాయకులు అనురాధ, గౌని ఐలయ్య, రాసుద్దీన్, బి.రమేష్, మోకాళ్ల రమేష్, క్రాంతి, పృధ్వీ, పౌరహక్కుల జిల్లా ఉపాధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, సీపీఎం కార్యదర్శి నబీ తదితరులు పాల్గొని దివంగత విశ్వనాధంకు నివాళులర్పించారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే కోరం కనకయ్య


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం

ఇల్లెందు టౌన్, జూలై 11 : ఇల్లెందు మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. గురువారం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఎస్‌ఈ భవన్, మల్టియుటిలిటిసెంటరు, గిరిజనభవన్, స్కిల్‌డవలప్‌మెంట్ సెంటరు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, పార్కు నిర్మాణ పనులను పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండ త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం సూచన మేరకు అభివృద్ధి పనులు శరవేగంగా జరిగేందుకు కృషి చేస్తామని తెలిపారు. పనులు త్వరలో పూర్తి చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వివిధ వార్డుల కౌన్సిలర్లు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

ఎస్టీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాయం


హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు, జూలై 11: మణుగూరు పట్టణంలోని అశోక్ నగర్‌లోని ఎస్టీ బాలుర హాస్టల్‌ను గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులతో మాట్లాడారు. హాస్టర్ పరిసర ప్రాంతం బాగా లోతుగా ఉండటం వల్ల వర్షపు నీరు బయటికి వెళ్లే మార్గం లేకుండా పోయింది. గ్రావెల్ పోసి పరిసరాలను చదునుగా చేయాలని వార్డెన్ ఎమ్మెల్యేను కోరారు. అలాగే పలు చోట్ల హాస్టల్ ప్రహరి దెబ్బ తిన్నదని దానికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పాయం ఐటీడీఏ ఏఈ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇందుకు సంబంధించిన ఎస్టిమేషన్లు వేసి నివేదిక అందజేస్తే వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మణుగూరు పట్టణంలోని ప్రజాభవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పాయం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలానికి చెందిన పి మానస, పి రాధ, అజ్మీరా తేజశ్రీ , సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం నారాయణలకు సుమారు రెండు లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను ఖండిస్తున్నాం

- టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/పాల్వంచ, జూలై11: జర్నలిస్టులపై దాడులను ఖండిస్తున్నామని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో డీఎస్సీ అభ్యర్థులు చేస్తున్న ఆందోళనను విధి నిర్వాహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై పోలీసులు దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. జర్నలిస్టుల సంస్థలపై దాడులు పాల్పడినప్పుడు మాత్రమే రోడ్లపైకి వస్తున్నారని అలా కాకుండా పాశవిక దాడులు జరిగిన సంఘటనలో ఐక్యంగా కలిసి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

పాల్వంచలో జర్నలిస్టుల నిరసన ర్యాలీ..

పాల్వంచ: ఉస్మానియా యూనివర్సిటీలో టీవీ జర్నలిస్ట్‌ను అతనికి సహాయకారిగా ఉన్న కెమెరామెన్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ పాల్వంచ జర్నలిస్టులు గురువారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ప్రెస్‌క్లబ్ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్ఐ కస్తూరికి వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్ట్ నాయకులు మట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారదిగా ఉన్న జర్నలిస్టులను పోలీసులు అకారణంగా అరెస్ట్ చేయడం దారుణమని, ఇటువంటి చర్యలు మానుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

మణుగూరులో రెస్క్యూ ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పర్యటన

మణుగూరు, జూలై 11: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో గురువారం రెస్క్యూ ఎక్స్‌ప్లోరేషన్ విభాగ జీఎం శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఏరియాలోని ఎస్ఎంఎస్ ప్లాంట్ పరిశీలించారు. పనిప్రదేశాల్లో తీసుకుంటున్న చర్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రధానంగా రక్షణ విషయంలో స్థానిక యాజమాన్య చర్యలను పరిశీలించారు. ఎస్ఎంఎస్ నుంచి ఉపరిత గనులకు సరఫరా చేసే ట్రాక్ వాహనాలకు అమర్చిన పరికరాల వివరాలను తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో జీఎం శ్రీనివాసరెడ్డి వెంట ఏరియా జీఎం దుర్గం రామచందర్,ఎస్వోటూ జీఎం వెంకటరమణ, డీఎజీఎం పర్సనల్ రమేష్, డీజీఎం ఐఈ కే వెంకట్‌రావు, డిజీఎం పర్చేజ్ శ్రీనివాసమూర్తి, డీజీఎం కేసీహెచ్‌పి మధన్ నాయక్, సినియర్ ఎస్టేట్ అధికారి బాబూల్ రాజ, సాయిల సురేస్ పాల్గొన్నారు.

పల్టీ కొట్టిన లారీ

అశ్వారావుపేట రూరల్, జూలై 11: రోడ్డుకిందకు దూసుకెళ్లి లారీ పల్టీలు కొట్టిన సంఘటన మండలంలో గురువారం సాయంత్రం జరిగింది. అశ్వారావుపేట నుంచి భద్రాచలం వైపునకు వెళుతున్న లారీ ఊట్లపల్లి సమీపంలో పెద్దచెరువుకు వెళ్లే మార్గం వద్ద కల్వర్టును ఢీకొట్టి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి.

స్వచ్ఛందంగా రహదారిని నిర్మించుకున్న రైతులు


పొలాలకు వెళ్లేందుకు మట్టి రహదారిని నిర్మించుకున్న రైతులు

జూలూరుపాడు, జూలై 11: పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ఎన్నో ఏళ్ల నుంచి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని నిర్మించి తమ ఇబ్బందులను తొలగించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్నప్పటికి ఫలితం లేదు. దీంతో రైతులు, గ్రామస్తులు చందాలు వేసుకుని మట్టి రహదారిని నిర్మించుకున్న సంఘటన గురువారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోచోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామచంద్రపురం గ్రామం నుంచి రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే వర్షం వస్తే తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో స్వయంగా వారే చందాలు వేసుకుని మరి కొంతమంది దాతల సహాయంతో మట్టి రహదారిని నిర్మించుకున్నారు. రహదారి నిర్మాణానికి సహకరించిన గుండెపూడి జేసీబీ యజమాని సూర్య ప్రకాష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నేడు అటవీ అభివృద్ది సంస్థ చైర్మన్‌గా పొదెం బాధ్యతల స్వీకరణ



భద్రాచలం, జూలై 11: రాష్ట్ర అటవీ అభివృద్ది సంస్థ చైర్మన్‌గా పొదెం వీరయ్య శుక్రవారం హైదరాబాద్‌లోని టీఎస్ఎఫ్‌డీసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించి భద్రాచలం మాజీ ఎమ్మెల్యేగా, డీసీసీ అధ్యక్షులుగా ఉన్న పొదెం వీరయ్యను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర అటవీఅభివృద్ది సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో భద్రాచలం నియోజకవర్గం నుంచి పలువురు నాయకలు ఆయనను అభినందించేందుకు తరలివెళ్తున్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోండి: డీఎస్పీ

చంద్రుగొండ, జులై 11: దేశంలో అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్ కోరారు. గురువారం చంద్రుగొండ కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే పలు రకాల వేధింపులు, దాడులకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ కొత్త చట్టాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ముందుగా ఉపాధ్యాయులు నూతన చట్టాలను అవగాహనచేసుకొని, విద్యార్థులకు వివరించాలని సూచించారు. అనంతరం మండలంలో ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన ఇసుక డ్రమ్ములను (బ్యారి గేట్లు) పరిశీలించారు. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనా రెడ్డి, ఎస్ఐ మాచినేని రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఏబీసీ ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు బానిసలుగా వ్యవహరిస్తున్న అధికారులు'

పాల్వంచ టౌన్, జూలై 11 : ఏ.బీ.సీ ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు కొత్తగూడెం, పాల్వంచ మున్సిపల్ అధికారులు బానిసలుగా వ్యవహరిస్తున్నారని పీఎఫ్ఏ (పీఎఫ్ఏ) పీపుల్స్ ఫర్ యానిమల్స్ సభ్యురాలు డాక్టర్ యామిని లక్ష్మి ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొత్తగూడెంలో వీధికుక్కలకు ఆపరేషన్ నిర్వహించే ఏబీసీ సెంటరు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, ఆపరేషన్ పేరుతో కుక్కలను దారుణంగా హింసిస్తూ వాటికి సరైన ఆహారం ఇవ్వకుండ అనేక కుక్కలమరణాలకు కారకులవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏబీసీ సెంటరు వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కొల్లి శ్రీనివాసరావు, వైష్ణవి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: ఏటీడీవో

ఇల్లెందురూరల్, జూలై 11: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఇల్లెందు ఏటీడీవో సూర్నపాక రాధ పాఠశాల హెచ్ఎంలకు సూచించారు.గురువారం మండలంలోని రోంపేడు గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. భోజన సదుపాయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.వర్షకాలంలో విద్యార్థులు వహించాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు.పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏడీడీవో రాధ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాధానోపాధ్యాయులు రవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి చేయూత

పాల్వంచ టౌన్, జూలై 11 : తనకు విద్యాబుద్దులు నేర్పి తన ఇంత ఉన్నతికికారణమైన తన గ్రామంలోని తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయంగా రూ.40వేలను పూర్వ విద్యార్థి చేయూతగా అందించారు. పట్టణ పరిధి సీతారామపట్నం ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి బూరుగుపల్లి ప్రసాదరావు రూ. 20వేల చెక్కుతోపాటు మరో రూ. 20వేల మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయురాలు సుధాశ్రీకి గురువారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అవసరాల దృష్ట్యా మున్ముందు కూడా తనవంతు సహాయ, సహకారాలు అందచేస్తానన్నారు. ప్రసాదరావును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధశ్రీ, ఉపాధ్యాయుడు శ్రీనివాస రెడ్డి పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్లమల సత్యం, నర్సింహారావు, సుధాకర్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పొదుపుతో ఆర్థిక భరోసా: ఏఎస్పీ

దుమ్ముగూడెం, జూలై 11: పోస్టల్ శాఖలో పొదుపు ఖాతాతో ఆర్థిక భరోసా కలుగుతుందని భద్రాచలం నార్త్ డివిజనల్ ఏఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. సీతారాంపురం పోస్టాఫీసు వద్ద గురువారం స్థానికులతో సమావేశం నిర్వహించారు. పోస్టల్‌శాఖలో జీవిత బీమా పాలసీలు కడితే కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతీ ఒక్కరూ పోసల్‌శాఖలో ఖాతా కలిగి ఉండాలని సూచించారు. ఐపీపీబీ మేనేజర్ జగదీష్, ఎంవో దుర్గాప్రసాదు, పీఎం కోటిరెడ్డి, సిబ్బంది గోపాల్, సాగర్, మైత్రి, నవ్య, కిరణ్, పవన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

జూలూరుపాడు, జూలై 11: ఆటో వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) చంద్రుగొండ ఆటో అడ్డా నూతన కమిటీని గురువారం జూలూరుపాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా అనంతారం గ్రామానికి చెందిన మల్కం వీరభద్రం, ప్రధాన కార్యదర్శిగా వెంగన్నపాలెంకు చెందిన నేలాల నవీన్‌ను నియమించారు. ఉపాధ్యక్షుడిగా పత్తిపాటి మోహన్‌రావు, కోశాధికారిగా రేపాల కోటేశ్వరరావులతో పాటు సలహాదారులుగా బాపట్ల పూర్ణచందర్‌రావు, సాంబయ్య జమలయ్య, కామేశ్వరరావు అరుణ్‌లను ఎన్నుకున్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈవోగా సమ్మయ్య

చర్ల, జులై 11: చర్ల మండల ఇన్‌చార్జ్ ఎంఈవోగా సున్నం సమయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇప్పటి వరకు జుంకీలాల్ ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించారు. జుంకీలాల్‌కు మండలాలు ఎక్కువ అవ్వడంతో దుమ్ముగూడెం ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న సమయ్యకు చర్ల అదనపు బాధ్యతలు అప్పగించారు.

సీతారామ జలాలు మండలానికి అందించాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు


మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకుడు కృష్ణ

జూలూరుపాడు, జూలై 11: సీతారామ జలాలను జూలూరుపాడు మండలానికి అందించే వరకు పోరాడుతామని అఖిలపక్షం నాయకులు అన్నారు. గురువారం మండలంలోని వెంగన్నపాలెంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మాస్ లైన్ ప్రజాపంథా మండల కార్యదర్శి బాణోత్ ధర్మా అధ్యక్షతన అఖిలపక్షం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణానికి భద్రాద్రి జిల్లాతో పాటు మండలానికి చెందిన రైతులు విలువైన భూములను కోల్పోయినప్పటికి వారి భూములకు నీరు అందించకుండా ఖమ్మం జిల్లాకు నీటిని తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రయత్నాలు చేయటం తగదన్నారు. వినోభానగర్ నుంచి ఏన్కూరు వరకు లింక్ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టి భద్రాద్రి జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక కెనాల్‌ను ఏర్పాటు చేసి మండలంలోని రైతులకు సీతారామ జలాలను అందించాలని లేకుంటే ఆందోళనలను చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు చీమలపాటి భిక్షం, టిడీపీ, సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా పార్టీల నాయకులు ఆరెం రామయ్య, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, మూడు చిట్టి బాబు, జాటోత్ కృష్ణ, వై. గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.